సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 23 । మే । 2025



సరస్వతీ నమస్తుభ్యం..
సరస్వతీ పుష్కరాలకు జిల్లా నుంచి భారీగా తరలి వెళ్తున్న భక్తులు ముక్తేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు.
8లో



ఎన్‌కౌంటర్‌ను ఖండించండి
మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ జిల్లాలో పలువురు ర్యాలీలు నిర్వహించారు.
9లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వరకు అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఇద్దరు అర్చకులకు నోటీసులు జారీ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ప్రధానార్చకులకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి గురువారం నోటీసులు జారీ చేశారు. రామాలయంలోని అభయాంజనేయ స్వామివారికి హనుమాన్ జయంతి సందర్భంగా తమలపాకార్చనను నిర్వహించడంలో అర్చకులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ప్రధానార్చకులు విష్ణు, కిరణ్ కుమారాచార్యులును వివరణ కోరగా తమలపాకార్చన నిర్వహించలేదని సమాధానం చెప్పారు. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారికి నోటీసులు జారీ చేశారు.

సింగిల్‌విండోలో హెచ్‌టీ సర్వీసుల మంజూరు

విద్యుత్ ఎస్‌ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీలతోపాటు అంతకంటే ఎక్కువ ఓల్టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. సర్కిల్ కార్యాలయంలో హెచ్‌టీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సింగిల్ విండో విధానంతో వినియోగదారులు టీజీ ఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు (టీజీ ఐపాస్‌లో నమోదుకాని) నమోదు చేసుకోవాలని, ఆ తర్వాత కొత్త అప్లికేషన్ నంబరు వస్తుందని వివరించారు. విద్యుత్ సిబ్బంది ఫీజిబిలిటీ కోసం అవసరమైన మౌలిక సదుపాయాల కోసం లొకేషన్‌ను సందర్శిస్తారని తెలిపారు. లోపాలుంటే రెండురోజులలోపు రిమార్క్స్ వివరాలను వినియోగదారునికి ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కర్‌నాయక్

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. మండలంలోని ఎర్రగుంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. శస్త్రచికిత్సలు లేకుండా సహజ ప్రసవాలు జరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని కోరారు. తమకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని 104 సిబ్బంది ఆవేదన వ్యక్తం చేయగా, తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ తన్మయ్, ఆరోగ్య సిబ్బంది ఎస్తేరు రాణి, ప్రకాష్‌రావు, హారిక, ప్రసాదరావు, కళ్యాణ్, లక్ష్మి, శరత్ పాల్గొన్నారు.

రామా.. కనవేమిరా!



హనుమాన్ మాలధారులతో నిండిపోయిన క్యూలైన్లు

అరకొర వసతులతో అంజన్న మాలధారుల ఇక్కట్లు

- తరలివచ్చిన భక్తులతో భద్రాచలంలో హనుమజ్జయంతి సందడి
- కనీస ఏర్పాట్లు చేయని ప్రభుత్వం.. దాతల స్పందన కూడా కరువే..

భద్రాచలం: మాల విరమించేందుకు భద్రగిరి వచ్చిన అంజన్న భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. హనుమాన్ మాలధారులు ఇక్కట్ల నడుమే గురువారం శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్నారు. హనుమజ్జయంతికి ప్రభుత్వం, దేవస్థానం ఏర్పాట్లు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో భక్తులు అధిక సంఖ్యలో హనుమాన్ మాల ధరిస్తారు. అయ్యప్ప మాలధారణ తర్వాత హనుమాన్ మాలధారణకే ఎక్కువ ఆదరణ ఉంటుంది. మాలధారులు కొండగట్టు అంజన్న వద్ద, భద్రాచలం శ్రీ సీతారాముల చెంతన ఇరుముడి విరమణ చేసేందుకు ఆసక్తి చూపుతారు. మూడు రోజుల్లో సుమారు 40 వేల మంది భక్తులు భద్రాచలాన్ని సందర్శిస్తారు. భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి తర్వాత హనుమాన్ జయంతికే ఎక్కువ మంది భక్తులు వస్తారని చెప్పవచ్చు. ఈసారి కూడా అధిక సంఖ్యలో అంజన్న మాలధారులు భద్రగిరి వచ్చారు. కానీ ప్రభుత్వం కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దేవస్థానం ఆధ్వర్యంలో కేవలం అధికంగా లడ్డూల తయారీ, ప్రత్యేక కౌంటర్ల ఏర్పాట్లు తప్ప ఇతరత్రా ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదు.



హనుమాన్ మాల విరమింపజేస్తున్న అర్చకుడు

క్యూలైన్లు కిటకిట

తరలివచ్చిన హనుమాన్ మాలధారులతో భద్రగిరి కాషాయవర్ణంగా మారింది. రోడ్లన్నీ సందడిగా మారాయి. శ్రీసీతారామ చంద్రస్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. బుధవారం అర్ధరాత్రి వరకు, మళ్లీ గురువారం తెల్లవారుజామున 3 గంటల నుంచే స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో మాలధారణ విరమణను అర్చకులు పూర్తి చేశారు. అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా హనుమాన్ జయంతి సందర్భంగా అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం, తమలపాకులతో అర్చన, తదితర పూజలను గావించారు. ప్రసాదాల కోసం శాశ్వత ఆరుకౌంటర్లు, స్టేడియంలో బ్యాంకర్ల ద్వారా నాలుగు, పడమర మెట్ల వైపు మరో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. ఈఓ రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నదానానికి ఇబ్బందులు

ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాల వేళ అధికారుల ప్రోత్సాహంతో దాతలు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, పులిహోర, అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తుంటారు. అధికారులు సన్నాహాలు చేయకపోవడంతో దాతలు కూడా ముందుకు రాలేదు. హనుమాన్ మాలధారులు చిన్న ఆటోలు, ట్రాలీలు, బస్సుల్లో తరలివస్తున్నారు. వీరందరూ హోటళ్లలో తినాలంటే ఆర్థిక భారం పడుతోంది. దేవస్థానం ఆధ్వర్యంలో, బ్రిడ్జి సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, అయప్ప స్వామి ఆలయం, ఇతరత్రా కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన అన్నదానాల వద్దకు భక్తులు బారులుదీరారు.




మందిరం ఏర్పాటు చేయాలి



హనుమాన్ మాలధారణ విరమణకు మిత్రులతో కలిసి వచ్చాం. మాలధారులు ఎక్కువ మంది ఉండటంతో చాలా ఆలస్యమైంది. సామూహిక మాలవిరమణకు మందిరం ఏర్పాటు చేస్తే బాగుండేది.
–సురేష్, హుజూరాబాద్

దాతలు స్పందిస్తే బాగుండేది



వేసవి కాలం కావడంతో ఎండ వేడిమికి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దాతలైనా ముందు కొచ్చి తాగునీరు, మజ్జిగ లాంటివి అందిస్తే బాగుండేది. ఎంతో దూరం నుంచి వచ్చిన మాకు కనీస ఆతిథ్యం లోపించింది.
–నరేష్, సిద్దిపేట

‘ఏసీబీ’తో భయం.. భయం

- సింగరేణిలో తొలిసారిగా చిక్కిన కార్మికుడు
- మిగతావారిపై ఆరా తీస్తున్న అధికారులు
- లోతుగా విచారిస్తే మరింతమంది వెలుగులోకి..
- మున్సిపాలిటీల్లో కూడా పెరిగిపోతున్న అవినీతి ఆరోపణలు



కొత్తగూడెంఅర్బన్: అత్యాశ, ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు ప్రభుత్వ అధికారులు ఏసీబీ వలకు చిక్కి జైలుపాలవుతున్నారు. కొందరు లంచం తీసుకుంటుండగా, మరికొందరు అవినీతి ఆరోపణలకు గురై సాక్ష్యాధారాలతో దొరుకుతుండటంతో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేస్తున్నారు. జిల్లాలో గడిచిన 16 నెలల కాలంలో ఏసీబీ అధికారులు 19 కేసులు నమోదు చేశారు. 27 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ప్రస్తుతం జిల్లాలో లంచం అడగాలంటే ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు వణుకు పుడుతుందనే చెప్పుకోవచ్చు. కానీ సింగరేణి, మున్సిపాలిటీల్లో అవినీతి పెచ్చుమీరుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణిలో ఈ నెల 6న ఏసీబీ దాడులు నిర్వహించింది. వర్క్‌షాపులో డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి దగ్గర రూ.50 లక్షలు, 100 ఫైళ్లు ఉన్నట్లు సమాచారం అందుకున్న అధికారులు కార్మికుడి ఇంట్లో సోదాలు చేసి ఆధారాలతో సహా పట్టుకుని కేసు నమోదు చేశారు. సింగరేణిలో మొదటిసారి దాడులు నిర్వహించిన సమయంలో సింగరేణి ఆస్పత్రిలో హడావిడి చేశారుకానీ నిందితులను పట్టుకోలేకపోయారు. రెండోసారి దాడుల్లో ఒకరిని అరెస్ట్ చేశారు. కార్మికుల బదిలీలు, మెడికల్ అనిఫిట్‌లు, ఇతర సమస్యల పరిష్కారానికి లంచం తీసుకుంటున్నవారు ఎవరెవరు ఉన్నారనే విషయాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. వివరాలన్నీ సేకరించే పనిలో ఉన్న వారు మరోసారి దాడులు చేస్తే ఏళ్ల తరబడిగా దందాలు చేస్తున్న వారు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కొంతకాలంగా సింగరేణి ఆస్పత్రి సమీపంలోని హోటళ్లను అడ్డాగా చేసుకుని కొందరు బదిలీలు, మెడికల్ అన్‌ఫిట్ దందాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి అడ్డాలు జిల్లా కేంద్రంలో అనేకం ఉన్నాయని, పక్కా సమాచారంతో దాడులు చేస్తే అక్రమార్కులకు చెక్ పెట్టవచ్చని పలువురు పేర్కొంటున్నారు. కొందరు కార్మిక సంఘ నాయకులు కూడా దందాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సింగరేణి విజిలెన్స్ దాడులు చేస్తే మేలు

సింగరేణి మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ చేయిస్తామని, బదిలీ చేయిస్తామని, ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని ఎవరైనా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సింగరేణి అధికారులు ప్రకటిస్తున్నారు. కానీ ఆచరణలో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో దందా యథాతథంగా జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. కార్మికుల బదిలీలు, అన్‌ఫిట్ తదితర విషయాల్లో లంచం తీసుకునేవారి వివరాలతో సింగరేణి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తే రూ.10 వేలు పారితోషికం అందజేస్తామని రెండు వారాల కిందట అధికారులు ప్రకటించారు. దందా యథేచ్ఛగా సాగుతున్నా ఇప్పటివరకు ఫిర్యాదులు రాలేదని సింగరేణి అధికారులు చెబుతున్నారు. ఆధారాలు ఉన్న కూడా తమ పనులు పూర్తయితే చాలు అనుకునే వారు వందల సంఖ్యలో ఉన్నారు. విజిలెన్స్ అధికారులను ఆశ్రయిస్తే వారి పనితోపాటు, వారు కూడా బయటపడే అవకాశం ఉందని కొందరు జంకుతున్నారు. అయితే విజిలెన్స్ అధికారులే అడ్డాలపై దృష్టి సారించి దాడులు చేస్తే అవినీతిపరులు దొరుకుతారని పలువురు పేర్కొంటున్నారు.

మున్సిపాలిటీలో ఇద్దరితో బోణీ...

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు ఉండగా, పాల్వంచ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఇద్దరూ ఏసీబీకి పట్టుబడ్డారు. మిగతా మున్సిపాలిటీల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు దాడులు చేస్తే మున్సిపాలిటీల్లోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది చిక్కే అవకాశముంటుంది. ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ, అశ్వారావుపేట మూడు మున్సిపాలిటీలకు కూడా ఒక్కరే కమిషనర్ ఉండటంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ సమయంలో ఏసీబీ నిఘా పెడితే అవినీతిపరులకు చెక్ పెట్టవచ్చని ఆయా మున్సిపాలిటీల ప్రజలు పేర్కొంటున్నారు.

భాగ్యరెడ్డివర్మ చిరస్మరణీయుడు



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త ఎంపీ భాగ్యరెడ్డివర్మ సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కొనియాడారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డివర్మ 137వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ కేంద్రంగా దళిత పాఠశాలలు స్థాపించారని, బాల్యవివాహాలు, అంటరానితనం వంటి దురాచారాలపై ఉద్యమించారని పేర్కొన్నారు. మద్యపాన నిషేధం, గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, షెడ్యూల్ కులాల సంక్షేమాధికారి అనసూర్య, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఏఓ రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారుల వెంట ఇంకుడు గుంతలు నిర్మించాలి

రహదారుల వెంట ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. జల్ సంచయ్ జన్‌భాగీ దారి కార్యక్రమంలో భాగంగా రహదారుల వెంట ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీరు నేలలోకి ఇంకి భూగర్భజల మట్టం పెరుగుతుందని అన్నారు. రోడ్ల పక్కన వర్షపునీరు నిలిచేందుకు ఎక్కువ అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇంకుడు గుంతలు తవ్వించాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో చుక్క వర్షపు నీరు కూడా వృథా కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలో జిల్లా ద్వితీయస్థానంలో ఉందని, అధిక సంఖ్యలో నిర్మాణాలు చేపట్టి ప్రథమస్థానంలో నిలపాలని సూచించారు.

26 నుంచి శిక్షణ తరగతులు

చుంచుపల్లి: లైసెన్స్‌డ్ సర్వేయర్ అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో శిక్షణ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 426 మంది అభ్యర్థులకు 50 పని దినాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉదయం 9 గంటలకు క్షేత్ర స్థాయిలో శిక్షణ, 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు థియరీ, ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ కోసం అవసరమైన ప్రాజెక్టర్లు, బోర్డులు తదితర అన్ని పరికరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టం అమలులో సర్వేయర్ల పాత్ర కీలకమని, అభ్యర్థులకు చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మైనింగ్ ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్, మైనింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘పచ్చిరొట్ట’పై పునరాలోచన!



రైతులు సాగు చేసిన జీలుగు(ఫైల్)

- విత్తన ధర పెంపు, రాయితీ తగ్గింపుతో రైతుల ఆందోళన
- 30 కేజీల జీలుగు బస్తా కొనాలంటే రూ.1,020 అదనపు భారం
- భూసారం కోసం పచ్చిరొట్ట సాగు చేయాలన్నా కష్టమే..

బూర్గంపాడు: పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ విధానాలను అవలంబించేందుకు ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాల సాగును ప్రోత్సహిస్తోంది. జిల్లాలో రైతులు మాగాణి భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది పచ్చిరొట్ట విత్తన ధరలను ప్రభుత్వం అమాంతం పెంచింది. గతేడాదితో పోలిస్తే రేటు రెట్టింపయింది. గతంలో 60 శాతం మేర ఉన్న రాయితీని 50 శాతానికి తగ్గించింది. విత్తన ధర పెంపు, సబ్సిడీ తగ్గింపుతో రైతులపై ఆర్థికభారం పెరిగింది.


జీలుగు వినియోగమే ఎక్కువ

జిల్లాలో ఏటా రైతులు పచ్చిరొట్ట సాగుకు ఎక్కువగా జీలుగులనే వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల జనుము సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పీఏసీఎస్‌ల ద్వారా జీలుగు విత్తనాలను సరఫరా చేయనుండగా, ఈ ఏడాది జిల్లాకు 5 వేల క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయి. గతేడాది సుమారు 6 వేల క్వింటాళ్లకు పైగా రైతులకు అందించారు. విత్తనాల రాశి తగ్గడం, ధర పెంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 30 కిలోల సంచి రెండు ఎకరాల సాగుకు సరిపోనుండగా, ఒక ఎకర సాగుకు రూ.1,100 వరకు ఖర్చవుతుంది. దుక్కికి మరో రూ.2 వేలు ఖర్చు చేయాలి. దీంతో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలా? వద్దా అని రైతులు ఆలోచిస్తున్నారు.

గతేడాది రూ.1,116.. ఈ ఏడాది రూ.2,137

గతేడాది 30 కిలోల జీలుగు విత్తనాల బస్తా ధర ప్రభుత్వ రాయితీ పోగా రూ.1,116 ఉండగా, ఈ ఏడాది ఆ ధర రూ. 2,137.50కు పెరిగింది. గతేడాది కిలో జీలుగుల ధర రూ.93 ఉండగా, ప్రభుత్వం రూ.55.80 సబ్సిడీ ఇవ్వగా రైతులు రూ. 37.20 చెల్లించారు. ఈ ఏడాది కిలో జీలుగు ధర రూ.142.50కు పెరిగింది. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ 71.25 పోగా రైతులు కూడా రూ.71.25 చెల్లించాలి. గతేడాది పోల్చితే ధర రూ.34 పెరిగింది. 30 కిలోల జీలుగు బస్తాకు రూ.1,020 అదనంగా పెరిగినట్లయింది. గతేడాది ప్రభుత్వం 60శాతం రాయితీ ఇవ్వగా ఈ ఏడాది రాయితీని 10 శాతం తగ్గించి 50శాతానికి కుదించింది.

రాయితీ పెంచి ధర తగ్గించాలి



జీలుగు విత్తనాల ధరలు రెట్టింపు చేయటం రైతులకు ఇబ్బందే. విత్తన ధరలు పెరిగితే ప్రభుత్వం రాయితీ పెంచాలి. అట్లకాకుండా ధరలు పెరిగినప్పుడు, రాయితీ తగ్గించటం సరికాదు. ఇప్పటికైనా రాయితీ పెంచి ధర తగ్గించాలి.
–ఊడుగుల సత్యం, రైతు, గొమ్మూరు

ఐదు వేల క్వింటాళ్లు సిద్ధం



జిల్లాలో ఐదు వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచాం. మండల వ్యవసాయ శాఖ అధికారుల రిక్వైర్‌మెంట్ ప్రకారం ఇంకా విత్తనాలు తెప్పిస్తాం. రైతులు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసి భూసారాన్ని పరిరక్షించుకోవాలి.
–బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఈ నెల 27వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్ష, మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు రెండో సంవత్సరం పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 24 కేంద్రాల్లో మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ కోర్సు విద్యార్థులు 1,359 మందికి 1,217 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 188 మందికి 163 హాజరయ్యారు. రెండు విభాగాల్లో 113 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు సంబంధించి జనరల్ కోర్సు 432 మందికి 404 మంది విద్యార్థులు హాజరు కాగా, 28 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులో 64 మందికి 54 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీంతోపాటు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశలు మెడికల్ కిట్లతో విధులు నిర్వహించారు. కొత్తగూడెంలో కొన్ని కేంద్రాల పేర్లు సరిగ్గా తెలియక కొందరు విద్యార్థులు మరో కేంద్రానికి వెళ్లి.. చివరి నిమిషంలో ఉరుకులు, పరుగులు తీశారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

అడిషనల్ ఎస్పీగా నరేందర్



ఏఎస్పీ నరేందర్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)గా గోపతి నరేందర్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పని చేస్తున్న ఈయన అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది వెయిటింగ్‌లో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు చేపట్టిన నేపథ్యంలో నరేందర్‌ను జిల్లాలో నియమించారు. అడిషనల్ ఎస్పీ పరితోష్ పంకజ్ జిల్లా నుంచి రెండు నెలల క్రితం బదిలీ కాగా, అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.

గిరిజన సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: పీసా యాక్ట్ ప్రకారం గిరిజన మహిళల కోసం కేటాయించిన ఇసుక సొసైటీలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏజెన్సీ ప్రాంతంలోని ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న మహిళా సొసైటీల సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు కాంట్రాక్టర్లను, బినామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. మహిళలందరూ ఐక్యంగా ఉండి గోదావరిలో ఇసుక వెలికితీత, నిర్వహణ బాధ్యతను విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసా స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్, తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శంకర్ నాయక్, ఏడీ మైన్స్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓ రాహుల్

క్లుప్తంగా

'బీమా'తో కుటుంబానికి ఆర్థిక భరోసా



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న బ్యాంక్ అధికారులు

బూర్గంపాడు: కుటుంబ ఆర్థిక భరోసాకు జీవిత బీమా తప్పనిసరని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నాగరాజు అన్నారు. గురువారం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని తమ బ్యాంకులో జీవిత బీమా చేసి ప్రమాదవశాత్తు, సహజ మరణాలు పొందిన తొమ్మిది మంది కుటుంబాలకు రూ.36 లక్షల విలువైన చెక్కులను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆర్థిక లబ్ధి చేకూరే బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ మేనేజర్ ఆర్.నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సునీల్‌కుమార్, రమేష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, రామకృష్ణ, సాయికృష్ణ, పాషా, ఐకేపీ ఏపీఎం నాగార్జున, ఎస్‌బీఐ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ నందు, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి దుప్పి..



ఓ ఇంటి ఆవరణలో ఉన్న చుక్కల దుప్పి

అశ్వారావుపేటరూరల్: అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన ఓ చుక్కల దుప్పి అశ్వారావుపేట పట్టణంలో హల్‌చల్ చేసింది. గురువారం మధ్యాహ్న సమయంలో అటవీ ప్రాంతం నుంచి పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వీధిలో ఉన్న జనవాసాల్లోకి వచ్చింది. గమనించిన స్థానికులు సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీయడంతో ఆందోళనకు గురై పరుగులు తీసింది. దీంతో బీఎస్‌ఆర్ నగర్ మీదుగా ఇందిరా కాలనీ నుంచి అల్లిగూడెం గ్రామం వైపు వెళ్లింది. సమాచారం అందుకున్న స్థానిక ఫారెస్టు రేంజర్ మురళి ఆధ్వర్యాన దుప్పిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. అది అటవీ సిబ్బందికి చిక్కకుండా అల్లిగూడెం సమీపంలో గల వ్యవసాయ క్షేత్రాలను దాటుకుని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. దాదాపు గంటపాటు పట్టణంలోని ఇళ్లల్లోకి వెళ్లి దుప్పి హల్‌చల్ చేయడంతో స్థానికులు చూసేందుకు పోటీ పడ్డారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో బాక్సింగ్ అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరగనున్న టైసన్ కప్ ఓపెన్ రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్యాట్రన్ ఝెర్రా కామేష్ వివరాలు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారుల్లో సబ్ జూనియర్స్ విభాగంలో గోనెల నిశాంత్ కుమార్, దాసరి హేమంత్, రాచకట్ల వినయ్, బొల్లోజు మహేశ్, ఆముదాల విజయ్ భాగ్యేష్, జూనియర్స్ విభాగంలో జిజుల అజిత్, గోనెల అక్షయ్ కుమార్ ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ వై.శివసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు షమీవుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ రాజా, ధనుంజయ్, సుహాష్ అద్వైత్, నున్న శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే నష్టపరిహారం



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్

అశ్వారావుపేటరూరల్: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు కింద నిర్మించే కాలువ నిర్మాణాల్లో సాగు భూములను కోల్పోతున్న బాధిత రైతులకు ప్రభుత్వ నిర్ణయించిన నష్ట పరిహారం మేరకే చెల్లిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.కార్తీక్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గ్రామసభను నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రాజెక్టుకు సంబంధించిన కాలువ నిర్మాణాలకు అవసరమైన భూములను సేకరిస్తున్నామని, ఎమైనా అభ్యంతరాలు ఉంటే వెల్లడించాలని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా అశ్వారావుపేట మండలంలో సుమారు 8 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, నష్టపోతున్న రైతులు సహకరించాలని కోరారు. ఈ గ్రామసభలో మున్సిపాలిటీ కమిషనర్ సుజాత, డీటీ రామకృష్ణ, ఇరిగేషన్ డీఈఈ కృష్ణ, ఏఈఈ కేఎస్‌బీ కృష్ణ, ఆర్‌ఐలు తాటి కృష్ణ, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం..

- పుష్కరాలకు జిల్లా నుంచి తరలివెళ్తున్న భక్తులు
- నదీస్నానం పుణ్యఫలమని నమ్మకం
- ఆ తర్వాత కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం





నదీ స్నానం చేసి పూజలు చేస్తున్న మహిళా భక్తులు (ఇన్ సెట్) కాళేశ్వరంలో శివుని సెట్టింగ్

ఇల్లెందురూరల్ : సరస్వతీ పుష్కరాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలి వెళ్తున్నారు. ఈనెల 15న ప్రారంభమైన పుష్కరాలు 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతీ నది ప్రవహిస్తోంది. ఈ త్రివేణీ సంగమంలో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా సరస్వతి పుష్కరాలు నిర్వహిస్తుండగా.. ఇక్కడ స్నానమాచరించిన భక్తులు పక్కనే ఉన్న ముక్తేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటున్నారు.

నదీ స్నానాలకు ప్రాముఖ్యం

సరస్వతీ పుష్కరాల్లో నదీ స్నానాలకు భక్తులు ప్రాధాన్యత ఇస్తున్నారు. పుష్కరస్నానం పుణ్యఫలమని, చదవుల తల్లిగా విరాజిల్లుతున్న సరస్వతీ నదిలో స్నానమాచరిస్తే సకల విద్యలు ప్రాప్తిస్తాయని భక్తుల నమ్మకం. కాళేశ్వరంలో స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్నానానంతరం భక్తులు నదీ తీరంలో సైకత లింగాలను ఏర్పాటు చేసి పూజలు చేయడంతో పాటు పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్నారు.

వివిధ మార్గాల్లో పయనం..

జిల్లాలోని అన్ని ప్రాంతాల భక్తులు నిత్యం పుష్కరాలకు వెళ్తున్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం నుంచి రోడ్డు మార్గంలో ఇల్లెందు, మహబూబాబాద్, నర్సంపేట, వరంగల్, పరకాల, భూపాలపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవచ్చు. లేదంటే రైలులో ఖమ్మం నుంచి వరంగల్ వెళ్లి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాళేశ్వరం వెళ్లొచ్చు.

ట్రావెల్స్ చార్జీల మోత..

జిల్లా నుంచి కాళేశ్వరానికి నేరుగా బస్సుల సౌకర్యం అంతగా లేకపోవడంతో భక్తులు ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కొందరు భక్తులు పుష్కరాలతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న కొండగట్టు, ధర్మపురి, వేములవాడ, లక్నవరం, రామప్ప, వరంగల్ వేయిస్థంబాల గుడి, భద్రకాళి అమ్మవారి దేవాలయం వంటి క్షేత్రాలను సందర్శిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్లు, సెలవులు కావడం, ఇప్పుడే పుష్కరాలు రావడంతో ప్రైవేట్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ధరల మోత మోగుతోంది.

దక్షిణ కాశీ దర్శనం ఆనందాన్నిచ్చింది



దక్షిణ కాశీగా పేరెన్నికగన్న కాళేశ్వరం దర్శనం ఆనందాన్నిచ్చింది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ పవిత్ర భూమిని ప్రత్యక్షంగా వీక్షించడం, పుష్కరస్నానం ఆచరించడంతో ధన్యులమయ్యాం. యమలింగం, శివలింగం దర్శనం మరింత సంతృప్తినిచ్చింది. – పొద్దుటూరి స్వప్న, కొమరారం, ఇల్లెందు మండలం

పుష్కరాలకు వెళ్లడం సంతృప్తినిచ్చింది



గోదావరి, కృష్ణ పుష్కరాలకు గతంలో వెళ్లాం. కానీ కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు వెళ్లడం మరింత సంతృప్తినిచ్చింది. మూడు నదుల సంగమ ప్రదేశాన్ని దర్శించడం, ఆ పుణ్య ప్రదేశంలో కుటుంబ సమేతంగా స్నానమాచరించడం అదృష్టంగా భావిస్తున్నాం. – పుల్లఖండం మమత, పోలారం, ఇల్లెందు మండలం

ఇంకుడుగుంతలతోనే నీటి సంరక్షణ



ఇంకుడుగుంతలు పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

మణుగూరు రూరల్: ఇంకుడు గుంతల ఏర్పాటుతోనే నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంపొందించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి తెలిపారు. గురువారం మండల పరిధిలోని లంకమల్లారం, సమితిసింగారం, గుట్టమల్లారం, ముత్యాలమ్మనగర్‌గ్రామపంచాయతర్ల ఇంకుడుగుంతలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటింటికి ఇంకుడుగుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, బోరు బావి, చేతిపంపుల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత లేకుండా ఉంటుందన్నారు. నేల స్వభావాన్ని, పరిసరాలను బట్టి ఈ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే రానున్న వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో మాజీ స్పీకర్



స్వామివారి సన్నిధిలో మధుసూదనాచారి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానాన్ని మాజీ స్పీకర్, బీఆర్‌ఎస్ నేత మధుసూదనాచారి గురువారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే బీఆర్‌ఎస్ నేత ఎనుగుల రాకేష్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. డివిజన్ నాయకులు మానె రామకృష్ణ, మండల కన్వీనర్ సునీల్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి కారు డ్రైవర్ ఆత్మహత్య



వెంకన్నబాబు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ కారు డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. పట్టణంలోని దండాబత్తుల వారి వీధికి చెందిన వరికూటి వెంకన్నబాబు(37) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గడిచిన కొద్ది రోజులుగా ఖాళీగా ఉండడంతో కుటుంబపోషణ భారంగా మారడంతో మనస్తాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెంకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం కలరు. కాగా, మృతుడి అన్నయ్య సత్యనారాయణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టేకులపల్లిలో ఏసీబీ దాడులు?

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ఏసీబీ అధికారులు మండలానికి చెందిన అధికారిని పట్టుకునేందుకు రెండు సార్లు ప్రయత్నం చేసినట్లు తెలిసింది. మండలంలో పని చేస్తున్న మండల అధికారిపై అవినీతి ఆరోపణలు, ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు గత వారంలో ఒక రోజు, ఈ వారంలో ఒకసారి ఆ అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు ప్రయత్నించగా ముందే పసిగట్టిన తప్పించుకున్నట్లు సమాచారం. అంతగా మండలంలో అవినీతికి పాల్పడుతున్న మండల అధికారి ఎవరన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు శాఖలకు చెందిన అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యాన తాజాగా టేకులపల్లి ఉదంతం వెలుగులోకి రావడంతో మండలంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపాన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారేపల్లి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన బానోత్ లాల్ సింగ్, ఇల్లెందు మండలం జింకలతండా గ్రామానికి చెందిన బానోత్ సుప్రజ ఇరువురు బైక్‌పై కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు వస్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు ఖమ్మంకు సిఫారసు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: ట్రాలీ ఆటో డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటనలో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. ఈ నెల 19న రాత్రి మండల పరిధి లక్ష్మీదేవిపల్లి బీసీఎం జాతీయ ప్రధాన రహదారి పక్కన మెకానిక్ షాపువద్ద ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేస్తున్న ఆసీఫ్, దంతలబోరు గ్రామానికి చెందిన పోలేబోయిన రాజారావు, చెరుకు శ్రీనులను పాల్వంచ వైపు వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయలు కాగా ఖమ్మంకు తరలించారు. పోలేబోయిన వీర్రాజు ఫిర్యాదు మేరకు ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా లింగపాలెం గ్రామానికి చెందిన డ్రైవర్ కంచర్ల కృష్ణయ్యపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

పందెంరాయుళ్లపై..

దమ్మపేట: కోడి పందేలు నిర్వహిస్తున్న పందెంరాయుళ్లపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దిబ్బగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి, తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దీంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.2,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయవాదాన్ని వ్యతిరేకించడం దేశద్రోహమే..



కేంద్రమంత్రికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఖమ్మంమయూర్‌సెంటర్: జాతీయవాదాన్ని వ్యతిరేకించడం దేశద్రోహమేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల నగరంలో జాతీయవాదుల నేతృత్వాన నిర్వహించిన తిరంగా యాత్రను కొంతమంది అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఘటనపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు నేతృత్వాన జిల్లా నేతలు కరీంనగర్‌లోని బండి సంజయ్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించగా.. ఆయన స్పందించారు.ఇలాంటి దేశద్రోహకర చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, దేశద్రోహం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరారు. బండి సంజయ్‌ను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు సన్నే ఉదయప్రతాప్, రమేష్, నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నాటుసారా, వ్యక్తితో ఎక్సైజ్ శాఖ అధికారులు

పినపాక: నాటుసార విక్రయించడానికి వెళ్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి దుగినేపల్లి గ్రామానికి చెందిన భూక్యా రామారావు జానంపేటలో నాటు సారా విక్రయించడానికి వెళ్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో అతని వద్ద ఎనిమిది లీటర్ల నాటు సారాతో పాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. నాటు సారా విక్రయించిన, తయారు చేసిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టును ఢీ కొట్టిన కంటైనర్..

డ్రైవర్ మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

బూర్గంపాడు: ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో కల్వర్టును ఢీ కొట్టిన ఘటనలో కంటైనర్ లారీ డ్రైవర్ మృతిచెందాడు. గురువారం సారపాకలో జరిగిన ఈ సంఘటన వివరాలను పోలీసులు ఇలా తెలిపారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం నేరెడ గ్రామానికి చెందిన ఐతరాజు నరేశ్(35) కంటైనర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనేపథ్యాన గురువారం కంటైనర్‌లో పేలుడు పదార్థాల లోడ్‌తో ఒడిశా వెళ్తున్న క్రమంలో సారపాక సంత సమీపాన ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో పక్కనే ఉన్న కల్వర్టును వేగంగా ఢీ కొట్టాడు. దీంతో నరేష్‌కు తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో ఇరుక్కుపోగా స్థానికులు, 108 సిబ్బంది శ్రమించి బయటకు తీశాక భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించగా.. ఘటనా స్థలాన్ని పాల్వంచ డీఎస్పీ సతీష్, సీఐ సతీష్ పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి డయాలసిస్ కేంద్రం సీజ్



సీజ్ చేస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అవకతవకలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టాన్ని ఉల్లంఘించినట్లు తేలడంతో ఆస్పత్రి కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ వెల్లడించారు. గురువారం ఆస్పత్రిని తనిఖీ చేసి సీజ్ చేశామన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద తప్పనిసరిగా ప్రమాణాలు పాటించి సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగభూషణం, డిప్యూటీ డెమో ఎండీ.ఫైజామోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫలరాజు ఫలించేలా..

యాజమాన్య పద్ధతితో అధిక లాభాలు

- నేల సారవంతానికి దుక్కులు అవసరం
- కొమ్మ కత్తిరింపులతో తెగుళ్ల నివారణ
- వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్



మామిడి తోట

వైరా: దేశంలో పండించే పండ్ల తోటల్లో ప్రధానమైనది, ఫలరాజుగా పేరుగాంచినది మామిడి. అయితే దీని సాగు విస్తీర్ణం దేశంలో మొత్తం 35శాతం ఉండగా.. 22,58,130 హెక్టార్లలో విస్తరించి ఉంది. రాష్ట్రంలో 1,15,990 హెక్టార్లు, జిల్లాలో 13,674 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. సాధారణంగా మామిడి రైతులు పూత, కాత దశలో మాత్రమే మామిడి తోటలపై దృష్టి సారించి చెట్టుకు కావాల్సిన ఎరువులు అందిస్తుంటారు. దీని వలన సరైన పోషకాలు అందక పూత సకాలంలో రాకపోవడం, వచ్చిన పూత, పిందె సరిగా నిలవక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యాన అధిక దిగుబడులు సాధించేందుకు కోత అనంతరం కొన్ని యాజమాన్య పద్ధతులు పాటించాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ సూచిస్తున్నారు.

కొమ్మ కత్తిరింపులు..

- మామిడి కాయ కోత అనంతరం కాయ తొడిమలున్న కొమ్మలు, ఎండిన కొమ్మలు, తెగులు సోకిన, విరిగిన కొమ్మలు, చెట్ల లోపల గాలి, వెలుతురు ప్రవేశానికి అడ్డుగా ఉన్న కొమ్మలను కత్తిరించాలి.
- పూత కాడల నుంచి వెనుకకు 15 సెంటీ మీటర్లు వరకు కత్తిరిస్తే నవంబర్, డిసెంబర్‌లలో కొత్త కొమ్మలు పుట్టుకొచ్చి, అవే వచ్చే రుతువులో పుష్పిస్తాయి.
- ప్రతీ రెమ్మ చివరి నుంచి 3–5 చిగుర్లు వస్తే ఆరోగ్యంగా ఉన్న రెండింటిని నిలుపుకొని మిగిలిన వాటిని తీసివేయాలి.
- కత్తిరింపులతో కొంత మేర తెగుళ్ల తగ్గే అవకాశం ఉండగా.. కత్తిరించిన కొమ్మ భాగాలకు బోర్డోపేస్ట్ పూయాలి లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి.

దుక్కి దున్నడం..

తొలకరిలో అనగా జూన్, జూలై మాసాలలో రైతాంగం చెట్ల మధ్యన దున్నాలి. దీని వలన కోశస్థ దశలో ఉన్న పురుగులు, కలుపు నివారించబడడంతో పాటు నేల గుల్లబారి, వేర్లకు గాలి బాగా చేరి చెట్టు ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుంది. అదే విధంగా నేలకు వర్షపు నీటిని పట్టి ఉంటే గుణం పెరిగి నేల సారవంతమవుతంది. మూడవ దుక్కి అక్టోబర్‌లో చేపడినట్లయితే నేలలో తేమ ఆరిపోయి సకాలంలో పూత రావడానికి దోహదపడుతుంది. దున్నేటప్పుడు చెట్టు నుంచి 1–5 మీటర్ల దూరంలో దున్నడం ఉత్తమం.

ఎరువుల యాజమాన్యం..

- కాసే తోటలో చెట్లకు సరిపైన మోతాదులో ఎరువులు అందించాలి. ఒక సంవత్సరం వయసున్న చెట్లకు 10 కిలోల పశువుల ఎరువు, 200 గ్రాములు యూరియా, 600 గ్రాములు సింగిల్ సూపర్ పాస్పేట్, 150 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి.
- అదే ఐదేళ్ల వయసున్న చెట్లకు 50 కిలోల పశువుల ఎరువు, కిలో యూరియా, 3 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 730 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి.
- పదేళ్లు, ఆపై వయసు గల చెట్లకు 100 కిలోల పశువులు ఎరువు, 2.2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్, 1.75 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- మామిడి కోత అయ్యాక సిపార్సు చేసిన 2/3 వంతు ఎరువులను వేయాలి. మిగతా 1/3 భాగం ఎరువులను కాయ ఎదుగుదల దశలో ఫిబ్రవరి రెండవ లేదా మూడవ వారంలో వేయాలి. సూక్ష్మధాత లోపాలు ఎక్కువగా ఉన్న తోటల్లో చెట్టుకు 150 గ్రాములు జింక్ సల్ఫేట్, 75 గ్రాములు బోరాక్స్, 100 గ్రాములు ఫెర్రస్ సల్ఫేట్ 125 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ పశువుల ఎరువుతో కలిపి జూన్, జూలై మాసాలలో మొక్కల పాదుల్లో వేయాలి. ఈ విధంగా యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మామిడి చెట్లు సెప్టెంబర్, అక్టోబర్‌లో కొత్త చిగుర్లు వేసి సకాలంలో పూత రావడమే గాక మంచి దిగుబడులు పొందవచ్చు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

పాల్వంచ: కులాంతర ప్రేమ వివాహం చేసుకుని కొంత కాలం కాపురం చేసిన తర్వాత కట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడెంకు చెందిన సుహాసిని, మహ్మద్ పాషా ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కొన్ని రోజులుగా కట్నం తేవాలని మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తుండగా సుహాసిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహనీయుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి అని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ కొనియడారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో భాగ్యరెడ్డి జయంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు రెహమాన్ భాగ్యరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా వర్మ బిరుదు పొందిన ఆయన అణగారిన, దళితుల అభివృద్ధికి, విద్యాసంస్థలు నెలకొల్పి వారి జీవితాల్లో విద్యతో వెలుగులు నింపారని కొనియాడారు. జగన్ మిత్ర మండలిని స్థాపించి దళితుల చైతన్యం కోసం పాటుపడ్డారని, దేవదాసి, జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి వారి కోసం కృషి చేసిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్‌ఐ లాల్‌బాబు, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎంటీఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ సేవలకు గుర్తింపు



ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంఅర్బన్: పోక్సో కేసులో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కేసుల పరిష్కారానికి కృషి చేసిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్‌కు గుర్తింపు లభించింది. పోలీస్ శాఖలో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్‌కు ప్రశంసాపత్రం లభించగా.. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో గురువారం డీఎస్పీని అభినందించారు.